## క్లుప్తంగా

### రగ్గులు పంపిణీ



విద్యార్థులకు రగ్గులు అందజేస్తున్న అబిద్ అలీ

**భూదాన్‌పోచంపల్లి:** పట్టణ కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌లోని 45 మంది విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అబిద్‌అలీ ఆర్థికసాయంతో శనివారం రగ్గులు పంపిణీ చేశారు. హాస్టల్‌కు ఇన్‌వెర్టర్ కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

### దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ

**భువనగిరిటౌన్:** దత్తత ఒక వరమని, పిల్లలు లేని దంపతులు దత్తత కోసం దరఖాస్తు చేసుకోవాలని సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు అన్నారు. దత్తత మాసం సందర్భంగా శనివారం భువనగిరిలోని బాల రక్షభవన్‌లో దత్తతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇప్పటివరకు దత్తత కోసం ఆన్‌లైన్ ద్వారా 50 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి 15మంది పిల్లలను దత్తత ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు రుద్రమదేవి, శివ రాజు, ఇస్తారి పాల్గొన్నారు.

### ఆరోగ్య కేంద్రం తనిఖీ

**మోత్కూరు:** మోత్కూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శిల్పిని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఓపీ, మందులు తదితర రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె వెంట డాక్టర్ హేమంత్‌కుమార్, అమరావతి, సీహెచ్‌ఓ దేవకి ఉన్నారు.

### పాఠశాల అభివృద్ధికి చేయూత

**వలిగొండ:** మండలంలోని టేకులసోమవారంలో గల ప్రభుత్వ పాఠశాలలో మంచినీటి గదికి, పాఠశాల కార్యాలయంలో ఫర్నీచర్‌కు అదే గ్రామానికి చెందిన పీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.60 వేల విరాళాన్ని ఫౌండేషన్ అధినేత పనుమటి నరేందర్ రెడ్డి మమతా శనివారం ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో చేగూరి గోపాల్, కలుకూరి బాల్ నర్సింహ, జంగయ్య, రాజమల్లు, కాసుల పరమేష్, అశోక్ పాల్గొన్నారు.

### 22న అవార్డుల ప్రదానం

**భువనగిరిటౌన్:** యాదగిరిగుట్టలోని రెడ్డిభవన్‌లో ఈనెల 22న పుడమి పుత్ర అవార్డుల ప్రదానం ఉంటుందని గాంధీ గ్లోబల్ జ్ఞాన ప్రతిష్ఠ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం భువనగిరి పట్టణంలోని రహదారి బంగ్లాలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

### ఓపెన్ టెన్త్ అడ్మిషన్లు ప్రారంభం

**భూదాన్‌పోచంపల్లి:** తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్‌లో విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల కోఆర్డినేటర్ టీకే రాజారెడ్డి శనివారం తెలిపారు. ఆసక్తికల్గిన అభ్యర్థులు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 11లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

### అక్రమ కేసులు ఎత్తివేయాలి

**భూదాన్‌పోచంపల్లి:** మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో ఉన్న శ్రీరంగనాయకస్వామి దేవాలయ భూమిలో ఇంటి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్నందుకు గ్రామస్తులపై పెట్టిన ఎస్సీ, ఎస్టీ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కార్యక్రమంలో బందారపు లక్ష్మణ్, రంగ విశ్వనాథం, బీరెడ్డి సందీప్‌రెడ్డి, కొంతం శంకర్, తోట శ్రీనివాస్, కట్టా మధు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

### స్థలం కేటాయించాలి

**చౌటుప్పల్:** చౌటుప్పల్‌లో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ శనివారం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. భవనం అందుబాటులో లేకపోవడంతో జర్నలిస్టుల రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సామిడి రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి దేశగోని శ్రీశైలం, హన్మంతరెడ్డి, రాములు, లింగస్వామి, శ్రీనివాస్, నర్సింహ పాల్గొన్నారు.

### డ్రైనేజీ పనుల పరిశీలన

**చౌటుప్పల్:** పట్టణ కేంద్రంలోని హైవే వెంట సర్వీస్‌రోడ్లకు ఇరువైపులా నిర్మిస్తున్న అస్తవ్యస్త డ్రైనేజీ నిర్మాణ పనులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు దూడల భిక్షం గౌడ్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. డ్రైనేజీ పనులను శనివారం వారు పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

# కంకరపోసి వదిలేశారు!

- నత్తనడకన సాగుతున్న కాచారం–పెద్దకందుకూరు బీటీ రోడ్డు పనులు
- అవస్థలు పడుతున్న వాహనదారులు

**యాదగిరిగుట్ట రూరల్:** గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు సరిగ్గాలేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. యాదగిరిగుట్ట మండలంలోని కాచారం గ్రామం నుంచి కుమ్మరిగూడెం, యాసోజిగూడెం, వయా బాహుపేట, పెద్దకందుకూరు వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకుండా కంకర పోసి వదిలేసారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఈ కంకర మీద ప్రయాణాలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**రూ.2.89 కోట్లతో నిర్మాణం**

కాచారం గ్రామం క్రాస్ రోడ్డు నుంచి వయా బాహుపేట, తాళ్లగూడెం పెద్దకందుకూరు వరకు దాదాపు



కంకర పోసి వదిలేసిన కాచారం-పెద్దకందుకూరు రోడ్డు

4.85 కిలోమీటర్ల బీటీ రోడ్డును రూ. 2.89 కోట్లతో నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రోడ్డు నిర్మాణానికి 2022 జనవరిలో అప్పటి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, గత ప్రభుత్వ విప్ గొంగిడి సునీత శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రహదారి నిర్మాణ పనులు పూర్తి కాలేదు.

**నిర్లక్ష్యంగా వహిస్తున్నారు**



కాచారం నుంచి వయా బాహుపేట, పెద్దకందుకూరు వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులు కంకరతోనే ఆపేసారు. ఈ కంకరపై బైక్‌పై వెళ్తూ చాలా మంది కిందపడ్డారు. పనులు పూర్తి చేయకుండా, అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వహిస్తున్నారు. అధికారులు స్పందించి బీటీ రోడ్డు పనులు పూర్తి చేయించాలి.

కవిడె మహేందర్, బాహుపేట

**నిధుల కొరతతో ఆలస్యం**

కాచారం క్రాస్ రోడ్ నుంచి పెద్దకందుకూరు వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులు కాంట్రాక్టర్‌కు నిధులు అందకపోవడంతో ఆలస్యం అవుతోంది. ఈ రోడ్డు నిర్మాణ పనులను కేంద్ర బృందం పరిశీలన చేశాక నిధులు విడుదల చేస్తారు. ప్రస్తుతం ప్రాసెస్ పూర్తయింది. మరో నెల రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అవుతాయి.

– శ్రీరామ్, పంచాయతీ రాజ్ డీఈఈ

# ప్రతి ఎకరానికి సాగు నీరందిస్తాం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**యాదగిరిగుట్ట రూరల్:** ఆలేరు నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగు నీరందించడమే తమ లక్ష్యమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. యాదగిరిగుట్ట మండలంలోని మల్లిగూడెం, రామాజీపేట, తాళ్లగూడెం గ్రామాల్లో అలుగు పోస్తున్న చెరువులకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదావరి జలాలతో ప్రతి చెరువును నింపుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజ్ గౌడ్, పీస్ సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య, కొక్కలకొండ అరుణ, మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు ఎల్లంల సత్తయ్య, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గాజుల రవికుమార్, సత్తిరెడ్డి, శ్రీను, రమేష్, పల్లెపాటి ప్రభాకర్, రాములు, రఘుపతి తదితరులున్నారు.

**ఖాజా నసీరోద్దీన్ దర్గా ఉర్సు**

**ఆత్మకూరు(ఎం):** ఆత్మకూరు(ఎం) మండలం కొరటికల్ పరిధి మదిరె ఇప్పల్లలో శనివారం ఖాజా నసీరోద్దీన్ బాబా దర్గా ఉర్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి ఆత్మకూరు(ఎం) మండల కేంద్రం నుంచి గంధాన్ని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, దర్గా కమిటీ చైర్మన్ బీసు చందర్ గౌడ్ తీసుకువచ్చారు. అనంతరం దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా నిర్వాహకుడు ఉస్సేన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, హన్మంతు గౌడ్ పాల్గొన్నారు.



మల్లిగూడెం గ్రామంలో చెరువు వద్ద పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

# రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే మందుల సామేలు

**అడ్డగూడూరు:** రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శనివారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రైతు పండుగ కార్యక్రమాన్ని అడ్డగూడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మావతి, మండల వ్యవసాయ అధికారి పాండురంగాచారి, ఏఈఓలు దయాకర్, నవనిత, అక్షర, మార్కెట్ వైస్‌చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు చిత్తలూరి సోమన్న, బాలెంల విద్యాసాగర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇంటికాల చిరంజీవి, పాశం సత్యనారాయణ, జోజి, మండల నాయకులు పాల్గొన్నారు.



రైతు పండుగను వీక్షిస్తున్న ఎమ్మెల్యే సామేలు

# సాగునీరు అందించేందుకు కృషి

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

**భువనగిరి:** భువనగిరి నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి సాగు నీరు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాజ్‌పూర్, వడపర్తి, హన్మాపురం చెరువులను గోదావరి జలాలతో నింపేందుకు తుర్కపల్లి మండలం రుస్తాపూర్ వద్ద కాల్వను నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. తుర్కపల్లి మండలంలోని పలు గ్రామాల నుంచి భువనగిరి నియోజకవర్గంలోని గ్రామాలకు గోదావరి జలాలను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఆర్డీఓ కృష్ణారెడ్డి ఉన్నారు.



బస్వాపూర్ రిజర్వాయర్ ప్రధాన కాల్వ నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

**నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే**

మండలంలోని బస్వాపూర్ రిజర్వాయర్ ప్రాజెక్టుకు సంబంధించి ప్రధాన కాల్వ ద్వారా వచ్చే నీటిని మండంలోని ముత్తిరెడ్డిగూడెం, రాయగిరి, ముస్త్యాలపల్లి, చీమలకొండూరు గ్రామాల చెరువులను నింపేందుకు నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్‌చిస్తీ, మాజీ ఎంపీపీ నిర్మల, మాజీ ఎంపీటీసీ శివానంద్, నాయకులు వెంకటేశం, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**రైతు పండుగను వీక్షించిన ఎమ్మెల్యే కుంభం**

**భువనగిరి:** మహబూబ్‌నగర్‌లో శనివారం నిర్వహించిన రైతు పండుగ కార్యక్రమాన్ని వీక్షించేందుకు భువనగిరి మండలంలోని అనాజీపురం గ్రామ రైతు వేదికలో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని ఆయన రైతులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్‌చిస్తీ, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను భారంగా భావించొద్దు



విచారణ నిర్వహిస్తున్న ట్రిబ్యునల్ చైర్మన్

**చౌటుప్పల్:** తల్లిదండ్రులను భారంగా భావించొద్దని సీనియర్ సిటిజన్, తల్లిదండ్రుల సంరక్షణ ట్రిబ్యునల్ చైర్మన్ శేఖర్‌రెడ్డి అన్నారు. పిల్లలు తమను పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇటీవల వచ్చిన పలు ఫిర్యాదులపై శనివారం ట్రిబ్యునల్‌లో విచారణ చేశారు. అందులో బాగంగా ఇరు వర్గాలను పిలిచి విచారించారు. ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులను కష్టపెట్టకుండా అవసాన దశలో బాగా చూసుకోవాలన్నారు. సంరక్షణ పట్టించుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విచారణలో ట్రిబ్యునల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది ముత్యాల సత్తిరెడ్డి, సెక్షన్ అధికారి కవితారెడ్డి పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను కలిసిన చిరుమర్తి



నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు శాలువా కప్పుతున్న కేసీఆర్

**నకిరేకల్:** తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవల్లిలో శనివారం రాత్రి నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్‌ఎస్‌ను క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని కేసీఆర్ సూచించారని చిరుమర్తి తెలిపారు. 2009 నవంబర్ 29న తెలంగాణ సాధనే లక్ష్యంగా కేసీఆర్ దీక్ష ప్రారంభించారని గుర్తు చేశారు. ఆయన సేవలను తెలంగాణ రాష్ట్రానికి అవసరమన్నారు. ఆయన వెంట నకిరేకల్ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు ఉన్నారు.

# ఫుడ్ పాయిజన్ మరణాలను పట్టించుకోని ప్రభుత్వం

**భువనగిరి:** ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు మరణిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అభిలాష్ ఆరోపించారు. ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ శనివారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో ప్రభుత్వ పాఠశాలల బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఈర్ల రాహుల్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





భువనగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

**తరగతుల బహిష్కరణ**

**గుండాల:** ఫుడ్ పాయిజన్ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం గుండాల మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను బంద్ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు దార సతీష్, ప్రశాంత్ తదితరులున్నారు.

**ఆత్మకూరు(ఎం):** ఎస్ఎఫ్ఐ పిలుపుమేరకు ఆత్మకూరు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు చరణ్, ప్రధాన కార్యదర్శి రితీష్, సాయి కిరణ్, మహేష్, దిశాంక్ పాల్గొన్నారు.

**బీబీనగర్‌లో**

**బీబీనగర్:** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో ఫుడ్ పాయిజన్ అవుతుండడంతో శనివారం బీబీనగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాలలు బంద్ చేయించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పవన్, కిరణ్, భగత్ పాల్గొన్నారు.

**ప్రభుత్వం విఫలం**

**రామన్నపేట:** ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు పుట్టల ఉదయ్‌కుమార్ కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు శనివారం మండల వ్యాప్తంగా పాఠశాలలు బంద్ చేయించారు. కార్యక్రమంలో సందీప్‌కుమార్, వేణు, శివకుమార్, సంతోష్ ఉన్నారు.

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**

**వలిగొండ:** ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థుల మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు బుగ్గ ఉదయ్ కిరణ్ అన్నారు. శనివారం వలిగొండలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో నరేందర్, ఎసోఫ్, సాయినాథ్, రిత్విక్, చంద్రశేఖర్, సాయిచరణ్, వరుణ్ పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి

**భువనగిరి:** తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎక్కువ సమయం గడపాలని ఎమ్మెల్సీ, కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవులపల్లి అమర్ అన్నారు. శనివారం భువనగిరి పట్టణంలోని విజ్ఞాన్ ఐఐటీ క్యాంపస్‌లో మానవ సంబంధాలు– విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం, విద్యా–సమాజం–తల్లిదండ్రుల పాత్ర అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పిల్లలతో స్నేహంగా ఉంటూ మానవ సంబంధాల గురించి తెలియజేయాలన్నారు. అనంతరం వారిని పాఠశాల కరస్పాండెంట్ పగిడాల జలందర్‌రెడ్డి, డైరెక్టర్ పురేందర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ ఐఐటీ క్యాంపస్ ప్రిన్సిపాల్ సువర్ణ, విజాన్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ స్వాతి పాల్గొన్నారు.





దేశపతి శ్రీనివాస్, దేవులపల్లి అమర్‌ను సన్మానిస్తున్న కరస్పాండెంట్ జలందర్‌రెడ్డి

## కాళేశ్వరం ప్రాజెక్టు ఫలాలతోనే నేడు చెరువులకు నీళ్లు



మాట్లాడుతున్న గొంగిడి సునీత

**మోటకొండూర్:** మాజీ సీఎం కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ఫలాలే నేడు చెరువుల్లో నింపుతున్న నీళ్లు అని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మోటకొండూర్ మండల కేంద్రంలో పార్టీ నాయకులు, రైతులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగమైన మల్లన్న సాగర్, కొండపోచమ్మల నుంచి కాలువల ద్వారా ఆలేరుకు నీళ్లు వస్తున్నాయన్నారు. కాళేశ్వరంతో రూ.లక్ష కోట్లు వృథా చేశారని కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపించి.. నేడు చెరువులు నింపుకుంటూ తమ ప్రభుత్వ ఫలాలే అని చెప్పుకోవటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, శ్రీకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

# ప్రజాపాలన ఉత్సవాలను విజయవంతం చేయాలి

**భువనగిరిటౌన్:** భువనగిరి మున్సిపాలిటీలో 9వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజాపాలన ఉత్సవాలను విజయవంతం చేయాలని భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో 15 ఎజెండా అంశాలతో అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజాపాలన విజయోత్సవాలకు ప్రతి వార్డుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిపారు.

**చెల్లింపులు, కమీషన్ల కోసమే సమావేశం**

మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం ప్రజా సమస్యల పరిష్కారానికి కాకుండా కేవలం బిల్లుల చెల్లింపులు, వాటి ద్వారా వచ్చే కమీషన్ల కోసమే ఏర్పాటు చేసినట్లు ఉందని బీఆర్‌ఎస్ కౌన్సిలర్ ఏవీ కిరణ్‌కుమార్ ఆరోపించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో చేసిన ఏర్పాట్లకు రూ.3.18లక్షలు జనరల్ ఫండ్ నుంచి కేటాయింపు నిలుపుదల చేయాలన్నారు. కలెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపాలిటీ ఎందుకు పెట్టుకుంటుందని వెంటనే తీర్మానం వాయిదా వేయాలని బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విచారణ చేయాలి

**భువనగిరిటౌన్:** అన్ని కెమికల్ ఫ్యాక్టరీలపై ఎంక్వైరీ చేయాలని, అదేవిధంగా గురుకుల హాస్టళ్లలో ఆహార నాణ్యత పరిశీలిచాలని భారతీయ జనతా యువమోర్చా శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు పట్నం కపిల్ మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట మండలం రామోజీపేట్ శివార్లలో మూసివేసిన యాదాద్రి లైఫ్ సైన్స్ కెమికల్ పరిశ్రమను అడ్డాగా చేసుకుని డ్రగ్స్ తయారుచేసి ముంబైకి తరలిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. గురుకుల హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఆహారం కల్తీ కాకుండా చూడాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి, జిల్లా అధికార ప్రతినిధి మంగు నరసింహారావు, జిల్లా కార్యదర్శి బట్టు క్రాంతి, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కానుకుంట్ల రమేష్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి రాళ్ల బండి కృష్ణాచారి, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి కొలిచిన మల్లికార్జున్, పట్టణ కార్యదర్శి శివప్రసాద్ ఉన్నారు.

# బియ్యంలో సున్నం డబ్బాలు

**చౌటుప్పల్ రూరల్:** చౌటుప్పల మండలం నాగారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి ఉపయోగించే బియ్యంలో సున్నం డబ్బాలు కనిపించాయని, ఇందేటని అడిగితే ప్రధానోపాధ్యాయుడు గురువారావు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు దోనూరి శ్రావణ్‌రెడ్డి ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ పిలుపు మేరకు శనివారం ఆయన నాగారం పాఠశాలకు వెళ్లి బియ్యాన్ని తనిఖీ చేశారు. నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని, లేదంటే విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కాగా.. ఈ ఘటనపై వివరణ అడగడానికి ప్రధానోపాధ్యాయుడిని సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

## విజ్ఞాన్‌లో ఫ్రెషర్స్ డే

**భూదాన్‌పోచంపల్లి:** మండలంలోని దేశ్‌ముఖిలోని విజ్ఞాన్ డీమ్డ్ టోబ్ యూనివర్సిటీలో శనివారం 'అలోహా ది అరైవల్' పేరిట బీటెక్, బీబీఏ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదివి తాము ఎంచుకొన్న లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ అనిల్, డాక్టర్ నవీన్, స్టూడెంట్ అఫైర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ అమీనా, ఎగ్జామ్స్ ఏసీఈ డాక్టర్ వేణు, ఫ్యాకల్టీ డాక్టర్ సునీల్, డాక్టర్ హిమామ్, డాక్టర్ సురేశ్, డాక్టర్ సయ్యద్, డాక్టర్ నరేశ్ పాల్గొన్నారు.





వేడుకల్లో పాల్గొన్న అధ్యాపక బృందం, విద్యార్థులు

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి



జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు

**భువనగిరి:** జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ గార్డ్స్ పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదుట తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, కార్యవర్గ సభ్యులు శోభన్‌బాబు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## డేటా ఎంట్రీ పరిశీలన

**ఆత్మకూరు(ఎం):** మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే డేటా ఎంట్రీ నమోదును జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి స్యామేల్ శనివారం పరిశీలించారు. మండలంలో 90 శాతం డేటా ఎంట్రీ పూర్తయినట్లు చెప్పారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ఎలిమినేటి లోకేశ్వర్‌రెడ్డి, ఏఎస్ఓ సంతోష్‌కుమార్ ఉన్నారు.

## సంక్షిప్త సమాచారం

**లోక్‌అదాలత్ సన్నాహక సమావేశం**

**చౌటుప్పల్ :** డిసెంబర్ 14న నిర్వహించనున్న లోక్ అదాలత్‌కు సంబంధించిన సన్నాహక సమావేశం శనివారం స్థానిక కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయమూర్తి మహతీవైష్ణవి మాట్లాడుతూ.. లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్, ప్రతినిధులు పాల్గొన్నారు.

**శ్రీశైలం శ్రీమల్లికార్జున దేవస్థాన వడ్డెర సత్రం కమిటీ డైరెక్టర్‌గా సుధాకర్**

**రాజాపేట:** శ్రీశైలం శ్రీ మల్లికార్జునస్వామి దేవస్థానం అఖిలభారత వడ్డీయ రాజుల (వడ్డెర) సత్రం నూతన కమిటీ డైరెక్టర్‌గా చల్లూరు గ్రామానికి చెందిన బొంత సుధాకర్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా సత్రం వ్యవస్థాపకుడు జెరిపెటి రాములు, సత్రం చైర్మన్, అధ్యక్షుడు జెడిరపెటి సత్యనారాయణలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**దంత సమస్యలపై అవగాహన**

**భూదాన్‌పోచంపల్లి:** మండలంలోని వంకమామిడి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం బీబీనగర్ ఎయిమ్స్ దంత విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ అభిషేక్ అరోరా, డాక్టర్ రాహుల్ నారంగ్, డీన్ అకడమిక్స్ డాక్టర్ అనురాగ్ నాగి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**దివీస్ పరిశ్రమలో రక్తదాన శిబిరం**

**చౌటుప్పల్:** మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ పరిశ్రమలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పరిశ్రమ మేనేజర్ సత్యచంద్ర దివి వర్ధంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన శిబిరాన్ని పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్స్ రామకృష్ణ, హేమంత్‌కుమార్, పెండ్యాల శ్రీనివాస్‌రావు, జనరల్ మేనేజర్లు సుధాకర్ రావు, బాలకిషోర్ సంయుక్తంగా ప్రారంభించారు.

**సివిల్ రైట్స్‌తో హక్కుల పరిరక్షణ**

**మోత్కూరు:** రాజ్యాంగం ప్రకారం రావాల్సిన హక్కులను సివిల్ రైట్స్ డేతో కాపాడుకోవచ్చని జిల్లా ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ దాసరి తిరుమలేష్ అన్నారు. శనివారం మోత్కూరు పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, డాక్టర్ హేమంత్‌కుమార్, గిర్దావర్ సుమన్, కౌన్సిలర్ కూరెళ్ల కుమార్ పాల్గొన్నారు.

**గుండాల:** పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గుండాల మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ దళిత వాడలో శనివారం గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ అనసూర్య, ఏఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**మోటకొండూర్:** కులమత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలని తహసీల్దార్ శాంతి లాల్ అన్నారు. శనివారం మోటకొండూర్ మండలంలోని చామాపూర్ గ్రామంలో ఎస్సీ కాలనీలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు.

**హక్కులపై అవగాహన ఉండాలి**

**వలిగొండ :** రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం వలిగొండ మండలంలోని నెమిలకాల్వలో నిర్వహించిన సివిల్ రైట్స్ డేలో ఆయన పాల్గొని మాట్లాడారు.

**ఆర్థికసాయం అందజేత**

**మోత్కూరు:** మోత్కూరు మండలంలోని అనాజిపురం గ్రామానికి చెందిన కుమ్మరికుంట్ల నర్సిరెడ్డి ఇటీవల మృతి చెందాడు. దీంతో పాడిచేడు జెడ్పీ ఉన్నత పాఠశాల 2006–07 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు మృతుడి తల్లికి రూ.21వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు.

**సంస్థాన్‌నారాయణపురంలో..**

**సంస్థాన్ నారాయణపురం:** మండలంలోని కడపగండితండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కరెంటోత్ రాంకోటి శనివారం మృతి చెందాడు. బాధిత కుటుంబానికి వాంకుడోతు దేవిలాల్ రూ.5వేలు, ముద్దంగుల నర్సింహ, కిషన్‌లు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

**పూర్తి స్థాయి పరిహారం చెల్లించాలని వినతి**

**భువనగిరి:** బస్వాపురం రిజర్వాయర్ ముంపు బాధితులకు పూర్తి స్థాయి పరిహారం చెల్లించాలని భువనగిరి పీఏసీఎస్ మాజీ చైర్మన్ సత్తిరెడ్డి కోరారు. బీఎన్ తిమ్మాపురం గ్రామ నాయకులతో కలిసి శనివారం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి హైదరాబాద్‌లో వినతి పత్రం అందజేశారు.

## దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి



ధర్నా చేస్తున్న దివ్యాంగులు

**భువనగిరి:** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ అన్నారు. ఈమేరకు శనివారం భువనగిరిలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సురుపంగ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి, జిల్లా కోశాధికారి కొత్త లలిత పాల్గొన్నారు.

## దరఖాస్తుల స్వీకరణ

**అడ్డగూడూరు:** మండల పరిధిలోని కంచనపల్లిలో ఉన్న కేజీబీవీ కళాశాలలో పీజీసీఆర్‌టీ (జువాలజీ, ఫిజికల్ సైన్స్) పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గెస్ట్ టీచర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ సరిత శనివారం తెలిపారు. ఈనెల 2 నుంచి 3వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.